# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | HYDERABAD




చెత్త ఎత్తకపోవడంతో.. బన్సీలాల్ ప్రధాన రహదారిలో ఇలా భారీగా చెత్తకుప్ప పేరుకుపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

## గ్రేటర్ @ 35.3 డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మరోసారి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.3 , కనిష్ఠం 22.7 డిగ్రీలు, గాలిలో తేమ 39 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# అక్రమార్కులకు ఆసరా..!

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులను బెంబేలెత్తిస్తున్న 200 మీటర్ల నిబంధన

ఇదే అదునుగా ఎన్‌వోసీకి లక్షల భేరం పెడుతున్న ఇంజినీర్లు

రెండ్రోజుల కిందట ఏసీబీకి చిక్కిన నీటి పారుదల శాఖ ఇంజినీర్


అధికారుల చుట్టూ తిరగలేక చేతులెత్తేస్తున్న ప్లాట్ల యజమానులు

టీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 5, (నమస్తే తెలంగాణ): అనుకున్నట్లే జరుగుతుంది... సర్కారు అనాలోచిత నిర్ణయం సామాన్యుడికి కష్టాలు తెచ్చి పెడుతున్నది... జీవోల రూపంలో ఉన్న నిబంధనలను తోసిరాజని ఓ అనధికారిక కొత్త నిబంధనను జనం మీద రుద్దుతుండటం కొందరు అధికారులకు వరంగా మారింది. సర్కారేదో ఖజానా నింపుకొనేందుకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఆగమేఘాల మీద హడావుడిగా చేస్తుండటంతో సందట్లో సడేమియాగా... కొందరు అధికారులు సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టి పండుగ చేసుకుంటున్నారు. దీంతో ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరిగి 'సమర్పించుకోలేక' ఏదైతే అది కానీ అంటూ చేతులెత్తేస్తున్నారు.

### హడావుడిగా తెర మీదకు..

అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా పట్టించుకోని ఆ ప్రక్రియను సుమారు నెల రోజుల కిందట హడావుడిగా తెర మీదకు తెచ్చింది. ఎలాగైనా గత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రూ.ఇ.3వేల కోట్లను ఖజానాకు మళ్లించుకోవాలనే లక్ష్యంతో 25 శాతం రిబేటుతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను భుజానికెత్తుకున్నది. అయితే ఈ హడావుడి తతంగంలో భారీ ఎత్తున అక్రమాలకు ఆస్కారం ఉందని 'నమస్తే తెలంగాణ' ముందుగానే స్పష్టం చేసింది. ముఖ్యంగా నీటి వనరుల బఫర్‌జోన్ నిర్ధారణలో దశాబ్దాలుగా జీవో 168 అమలులో ఉంది. కానీ ప్రభుత్వం ఈ హడావుడి తతంగంలో జీవోకు భిన్నంగా నీటి వనరుల చుట్టూ 200 మీటర్లు (సుమారు పావు కిలోమీటర్) దూరంలోని ప్లాట్ల క్రమబద్ధీకరణపై ఆంక్షలు విధించింది.

ఈ పరిధిలోని స్థలాలకు నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌వోసీలు తీసుకురావాలనే షరతు విధించింది. వాస్తవానికి పట్టణ ప్రాంతాల్లో ఉండే నదుల వద్దనే బఫర్‌జోన్ అనేది గరిష్ఠంగా 50 మీటర్ల మేర ఉంది. ఇక... చెరువులు, కుంటల బఫర్‌జోన్ అనేది దాని కంటే తక్కువగా, ఆయా నీటి వనరుల విస్తీర్ణం ఆధారంగా ఉంటుంది. ఎంత పెద్ద చెరువు అయినా గరిష్ఠంగా బఫర్‌జోన్ అనేది ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్లు అంటే సుమారు వంద అడుగులు మాత్రమే ఉంటుంది. కానీ నెల రోజుల కిందట ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియలో చిన్న కుంట అయినాసరే దాని చుట్టూ 200 మీటర్లు అంటే దాదాపు 650 అడుగుల పరిధిలోని ప్లాట్లకు నీటి పారుదల శాఖ ఎన్‌వోసీ కావాలనే షరతు విధించింది.



### రూ.211 కోట్ల ఆదాయం

మేడ్చల్, ఏప్రిల్5(నమస్తే తెలంగాణ): అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)ద్వారా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ. 211 కోట్ల ఆదాయం లభించింది. జిల్లా వ్యాప్తంగా 25 శాతం రాయితీని 29 వేల మంది సద్వినియోగం చేసుకున్నారు. దీంతో ఫీజుల ద్వారా రూ. 211 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. ఎల్ఆర్ఎస్‌ను క్రమబద్ధీకరణకు 1,65 దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలన అనంతరం లక్ష పైచిలుకు దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించే అనుమతిని ఇచ్చారు. అయితే 29 వేల మంది దరఖాస్తుదారులు మాత్రం గత నెల 31 వరకు ఫీజులు చెల్లించగా మరో 70 వేల దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించాల్సి ఉంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు ఈ నెల 30 వరకు ప్రభుత్వం గడువు పెంచడంతో ప్రభుత్వానికి ఎల్ఆర్ఎస్ ద్వారా మరింత ఆదాయం చేకురే అవకాశమున్నది.

### లక్షల్లో డిమాండు చేస్తున్న ఇంజినీర్లు..

గతంలో చెరువులకు అతి సమీపంలో ఉన్న వాటికి మాత్రమే నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకురావాల్సి ఉండేది. కానీ ఇప్పుడు 200 మీటర్ల పరిధిలోని అన్నింటికీ అని ప్రభుత్వం కొత్త షరతు విధించడం నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు కనకవర్షాన్ని కురిపిస్తున్నది. ఈ క్రమంలోనే ఎన్‌వోసీకి లక్షల్లో డిమాండు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల కిందట పటాన్‌చెరు డీఈ కార్యాలయంలో లక్ష రూపాయల లంచం తీసుకుంటున్న ఏఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఇది బయటికొచ్చిన కేసు ఒకటి మాత్రమే... కానీ చాలామంది సామాన్యులు చేసేదిలేక గుట్టుగా సమర్పించుకుంటున్నవారు కొందరు. చాలామంది ఇదెక్కడి నిబంధన బాబోయ్ అంటూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

ఎల్ఆర్ఎస్ రాయితీకి కూడా దరఖాస్తుదారుల నుంచి స్పందన కరువవడానికి ఇదో కారణంగా కూడా అధికారులు చెబుతున్నారు. కొందరైతే ఎల్ఆర్ఎస్ ఫీజు కంటే ఎన్‌వోసీకి అడుగుతున్న లంచమే ఎక్కువగా ఉంటుందని వాపోతుండటం గమనార్హం.

# విద్యార్థుల ప్రతిఘటన

పోలీసులు హెచ్‌సీయూ క్యాంపస్ వదిలి వెళ్లాలని డిమాండ్

భూములపై అడ్మిన్ హైకోర్టులో అడ్మిన్ పిల్ వేయాలని వినతి

డిమాండ్లు నెరవేర్చాలని క్యాంపస్‌లో భారీ ర్యాలీ

సిటీ బ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల్లో రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన విధ్వంస కాండను నిలిపివేసి, హెచ్‌సీయూను ఖాళీ చేయాలని సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా నిర్బంధం కొనసాగించడంపై విద్యార్థులు ఆగ్రహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నార్త్ షాపింగ్ కాంప్లక్స్ నుంచి ఈస్ట్ క్యాంపస్ ద్వారా వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ భూములను కాపాడాలంటూ చేపట్టిన ఆందోళనల్లో అక్రమంగా అరెస్ట్ చేసి కస్టడీలో ఉంచిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే భేషరతుగా కొట్టేయాలని కోరారు. క్యాంపస్‌లో ఉన్న వందలాది మంది పోలీసులను వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. పనులు నిలిపేసిన తర్వాత పోలీసులకు క్యాంపస్‌లో ఏం పని అంటూ ప్రశ్నించారు. కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా యూనివర్సిటీలో నిర్బంధాలు కొనసాగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు సహకరించాలని విద్యార్థులు కోరారు. యూనివర్సిటీ పరిధిలోని మొత్తం భూములకు యాజమాన్య హక్కులు సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడాలన్నారు. భూములన్నీ హెచ్‌సీయూ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టులు పిల్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

### ఫోన్లపై నిఘా!

వర్సిటీ విద్యార్థుల ఫోన్లపై కాంగ్రెస్ సర్కార్ నిఘా ఉంచిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల పాటు యూనివర్సిటీ భూముల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సృష్టించిన విధ్వంసకాండను బయటి వారికి చేరవేస్తున్నారనే నెపంతో తమ ఫోన్ సంభాషణలు వింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను దేశద్రోహులు, ఉగ్రవాదుల్లా చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు



# సమ్మర్‌కు అరకొరగా..

ప్రయాణికుల అవసరాలు తీర్చలేక పోతున్న ప్రత్యేక రైళ్లు

పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో ఊపందుకున్న ప్రయాణాలు

కిటకిటలాడుతున్న రైల్వే స్టేషన్లు

జనరల్ టికెట్‌లో 50 శాతం వరుకు అదనపు వసూళ్లు

లబోదిబోమంటున్న ప్రయాణికులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సమ్మర్ కోసం అరకొరగానే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకం పేరుతో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లు.. వేసవి కాలంలో ప్రయాణించే వారి అవసరాలు తీర్చ లేక పోతున్నాయి. దీనికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వేసవి రద్దీని సరిగా అంచనా వేయకుండానే ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లు ఏ మాత్రం సరిపోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ప్రస్తుతం ఇంటర్మీడియట్‌తో పాటు టెన్త్‌క్లాస్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. పైగా వేసవి సెలవులు వచ్చాయి. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలతో పాటు అధిక సంఖ్యలో ప్రయాణాలు మొదలయ్యాయి. వేసవి అవసరాల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్లలో ప్రయాణికులకు అవసరమైన వసతి సౌకర్యాలు, ముఖ్యంగా నీటి సదుపాయాలు కల్పించక పోవడంతో పాటు ప్రత్యేక రైళ్లలో అపరిశుభ్రత తాండవిస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

### ప్రయాణికులతో రైల్వే స్టేషన్లు కిట కిట..

రాష్ట్రంలో ఇంటర్, టెన్త్‌క్లాస్ పరీక్షలు పూర్తి కావడం, వేసవి సెలవులు రావడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య సహజంగానే పెరుగుతుంది. దీంతో రైల్లే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ సాధారణం కంటే ఎక్కువ మొత్తంలో నమోదవుతుంది. ప్రయాణికుల శ్రేయస్సు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న రైల్వే అధికారులు.. వారి అవసరాలు తీర్చే విషయంలో మాత్రం ససేమిరా అంటున్నారు. పైగా సాధారణ రైలు చార్జీల కంటే.. అదనంగా దాదాపు 50 శాతం వరకు రైలు చార్జీలు పెంచుతున్నారు. తెలిసీ, తెలియని ప్రయాణికులపై రైల్వే శాఖ ఛార్జీల బాదుడుతో వారంతా లబో దిబోమంటూ ఆవేదన వ్యకం చేస్తున్నారు. రద్దీ పేరుతో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ, వారిలో సరైన వసతులు కల్పించకుండా, జనరల్ టికెట్ చార్జీలపై అదనంగా 50 శాతం వరకు చార్జీలు గుంజుతున్న రైల్వే శాఖ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు మద్యం షాపులు బంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయాలంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో శ్రీరామనవమి శోభయాత్ర ఉన్నందున శాంతిభద్రతలు పరిరక్షించడంలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# అదనపు బోగీలు ఇంకెప్పుడు?

కాగితాలకే పరిమితమైన మంత్రి హామీ

అవస్థలు పడుతున్న మెట్రో ప్రయాణికులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఇంకా కార్యరూపంలోకి రాలేదు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా నగరవాసులకు అదనపు బోగీలతో మెరుగైన రవాణా సదుపాయం కల్పిస్తామంటూ మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటన కాగితాలకే పరిమితమైంది. అదనపు బోగీల విషయంలో ప్రభుత్వం దృష్టి సారించిందని, ఈ అంశంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఓ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఈ అంశంలో ప్రభుత్వం మెట్రో నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీనీ ఆదేశించింది లేదు. కొత్త బోగీలను తెచ్చింది లేదు.

### రద్దీకి పరిష్కారమేదీ?

రద్దీగా ఉండే మార్గాల్లో తొలి దఫా అదనపు బోగీలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. అమీర్‌పేట, రాయదుర్గం, సికింద్రాబాద్ వంటి స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, 4 అదనపు కోచ్‌లను నాగ్‌పూర్, పుణె మెట్రో నుంచి లీజుకు తీసుకునేలా ప్రతిపాదించారు. కాగా, రద్దీకి అనుగుణంగా బోగీలు అందుబాటులో లేకపోవడంతో.. మరో రైలు వచ్చేంత వరకు ప్లాట్‌ఫాంపై ఎదురుచూసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఏడాదిన్నర కాలంగా బోగీలను పెంచాలనే డిమాండ్ చేస్తున్నా... అటు మెట్రో కానీ, ఎల్ అండ్ టీ కానీ పట్టించుకోవడం లేదు.






## పన్నులు మీకు.. గుంతలు మాకా..

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ మారుతీ నగర్ రోడ్డుతో పాటు ఇతర రోడ్లు గుంతలు పడడంతో 'పన్నులు మీకు..గుంతలు మాకా' అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ తో పాటు స్థానికులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మౌలాలి డివిజన్‌లో మెయిన్ రోడ్డుతో పాటు కాలనీలో రోడ్లు గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్లకు మరమ్మతు చేయడంతో పాటు సీసీ రోడ్లు వేయాలన్నారు. ఇప్పటికే అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వంటావార్పుతో నిరసన

గ్రామ పంచాయతీలకు కార్మికుల సమ్మె సెగ తగిలింది. 5 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు. విధులు పక్కన పెట్టి పంచాయతీ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులోభాగంగా అలియాబాద్ గ్రామపంచాయతీ ఎదుట వంటా వార్పుతో సహపంక్తి భోజనాలు చేశారు.
- శామీర్‌పేట, ఏప్రిల్ 5



# కొత్వాల్ గూడకే దిక్కు లేదు.. హెచ్‌సీయూలో ఎకో పార్కా?

ఏడాదిన్నరగా పూర్తి కాని కొత్వాల్ గూడ ఎకో పార్కు నిర్మాణ పనులు

వరల్డ్ క్లాస్ ఎకో టూరిజం పార్క్‌గా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ సర్కారు

మిగిలిన పనులు పూర్తి చేయని కాంగ్రెస్ సర్కారు

హెచ్ఎండీఏ పెండింగ్ పనులను ఇప్పటికీ సమీక్షించని సీఎం రేవంత్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన హెచ్‌సీయూ భూముల్లో సింగపూర్ తరహా ఏకో పార్క్ నిర్మిస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా మారాయి. 2వేల ఎకరాల్లో ఏకో టూరిజం పార్క్, నైట్ సఫారీ డెవలప్ చేస్తామంటూ చెబుతోంది. కానీ ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్ గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి పోర్ట్‌పోలియోలో ఉన్న హెచ్ఎండీఏ పెండింగ్ పనులపై ఇప్పటి వరకు ఒక్కసారి సమీక్షించి, వరల్డ్ టూరిజాన్ని ప్రోత్సహించే కొత్వాల్ గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను మాత్రం పూర్తి చేస్తామని ప్రకటించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ ఆధీనంలో ఉన్న హెచ్ఎండీఏలో 90శాతం పనులు పూర్తయిన కొత్వాల్ గూడ ఎకో పార్క్‌ను ఇప్పటికీ పూర్తి చేయడం లేదు కానీ... కొత్తగా వివాదాస్పదమైన హెచ్‌సీయూలోని 2వేల ఎకరాల భూముల్లో ఎకో టూరిజం పార్క్ నిర్మిస్తామని ఊరిస్తోంది. కేవలం పెండింగ్ పనులను పూర్తి చేస్తే నగరవాసులకు వరల్డ్ క్లాస్ టూరిజం పార్క్ అందుబాటులోకి వస్తుందని తెలిసినా... ఆ పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదు.



### 125 ఎకరాల విస్తీర్ణంలో..

ఏడాదిన్నర కాలంగా కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అభివృద్ధి పనులన్నీ అటకెక్కాయి. దాదాపు 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పార్కులో గత ప్రభుత్వం 75 శాతానికి పైగా పనులు చేపట్టింది. దాదాపు 25శాతం పనులు పెండింగ్‌లో ఉండగా... ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కావస్తున్నా.. ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదు. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి సదుపాయాలతో అధునాతన టూరిజం వేదికగా కొత్వాల్ గూడ మార్చేలా 2022లో కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న నిర్లక్ష్యంతో... ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ మోక్షం రావడంలేదు. మహానగర జంట జలాశయాలకు సమీపంలో ఉన్న ఎకో టూరిజం పార్క్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. కానీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తూ... వివాదాస్పదమైన హెచ్‌సీయూ భూముల్లో ఎకో టూరిజం పార్క్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.